# భక్తిశ్రద్ధలతో దుర్గమ్మ నిమజ్జన శోభాయాత్ర

ఎల్లారెడ్డి రూరల్, అక్టోబర్ 25: దేవీ శరన్నవరాత్రులు భక్తిశ్రద్ధలతో ముగిశాయి. ఎల్లారెడ్డి పట్టణంలో మంగళవారం రాత్రి దుర్గామాత నిమజ్జన శోభాయాత్రను చేపట్టారు. పట్టణంలోని తొమ్మిది మండపాల నిర్వాహకులు దుర్గామాత విగ్రహాలను అందంగా అలంకరించిన ట్రాక్టర్లపై ఉంచి గ్రామంలోని ప్రధాన వీధుల్లో శోభాయాత్ర నిర్వహించారు. మాలధారులు వాహనాల ఎదుట నృత్యాలు చేయగా.. మహిళలు మంగళ హారతులు పట్టారు. బుధవారం తెల్లవారుజామున స్థానిక పెద్ద చెరువులో విగ్రహాలను నిమజ్జనం చేశారు.

***దుర్గామాత లడ్డూకు పోటాపోటీ..***



ఎల్లారెడ్డిలో నిమజ్జనానికి తరలుతున్న దుర్గామాత విగ్రహం



నిజాంసాగర్‌లో లడ్డూను అందుకుంటున్న రాజు

నిజాంసాగర్, అక్టోబర్ 25: మండలంలోని బంజపల్లిలో దుర్గామాత మండపం వద్ద మంగళవారం రాత్రి లడ్డూకు వేలం నిర్వహించగా.. భక్తులు పోటాపోటీగా పాల్గొన్నారు. మండల కేంద్రానికి చెందిన వడ్ల రాజు 39,101 రూపాయలకు లడ్డూను దక్కించుకున్నాడు. మహ్మద్‌నగర్ మండలంలోని హసన్‌పల్లి గ్రామ దుర్గామాత మండపం వద్ద నిర్వహించిన వేలంలో గ్రామ మాజీ ఉప సర్పంచ్ వెంకట్రాములు 35వేల రూపాయలకు లడ్డూను దక్కించుకున్నాడు. నిర్వాహకులు వారికి లడ్డూను అందజేసి సన్మానించారు. మండలంలోని ఆయా గ్రామాల్లో దుర్గామాత విగ్రహాల నిమజ్జన శోభాయాత్ర అంగరంగ వైభవంగా నిర్వహించారు.

## పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత



బాధితుడికి సెల్‌ఫోన్‌ను అందజేస్తున్న ఎల్లారెడ్డి ఎస్సై గణేశ్

ఎల్లారెడ్డి రూరల్, అక్టోబర్ 25: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా రికవరీ చేసి ఎస్సై గణేశ్ బాధితునికి బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సెల్‌ఫోన్ వివరాలను భద్రపరచుకోవాలని, ఫోన్ పోయినా.. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా రికవరీ చేయవచ్చని తెలిపారు. ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన బట్టు మహేందర్ ఏడు నెలల క్రితం ఎల్లారెడ్డిలో ఫోన్ పోగొట్టుకున్నాడు. పూర్తి వివరాలతో పోలీసులకు ఫిర్యాదు చేయగా.. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఆచూకీ కనుగొని రికవరీ చేశారు. దానిని బాధితుడికి అందజేశామని ఎస్సై తెలిపారు.

## బెల్టు షాపులపై దాడి



పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు

పెద్ద కొడప్‌గల్, అక్టోబర్ 25: మండలంలోని కుబ్యానాయక్ తండాలో బెల్టు షాపులపై పోలీసులు బుధవారం దాడి చేశారు. ఈ సందర్భంగా 8.4లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నామని ఏఎస్సై రాములు తెలిపారు. ఎస్సై కోనారెడ్డి మాట్లాడుతూ.. తండాలో మద్యం అమ్ముతున్నారనే పక్కా సమాచారం మేరకు దాడి చేశారని చెప్పారు. అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తే కేసులు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల నిబంధనలను ప్రతిఒక్కరూ పాటించాలన్నారు. మద్యం స్వాధీనం చేసుకొని నిర్వాహకుడిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

## ఐలమ్మ విగ్రహావిష్కరణ వాయిదా

తాడ్వాయి, అక్టోబర్ 25: మండలంలోని దేమికలాన్ గ్రామంలో బుధవారం నిర్వహించాల్సిన చాకలి ఐలమ్మ విగ్రహావిష్కరణ వాయిదా వేసినట్లు బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు మద్ది మహిందర్‌రెడ్డి తెలిపారు. విగ్రహాన్ని ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఆవిష్కరించాల్సి ఉండగా.. ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. విగ్రహాన్ని ప్రారంభించే తేదీని త్వరలోనే ప్రకటిస్తామని ఆయన పేర్కొన్నారు.

## ముమ్మరంగా వాహనాల తనిఖీ



బొల్లక్‌పల్లి వద్ద కారును తనిఖీ చేస్తున్న పోలీసులు

పిట్లం, అక్టోబర్ 25: అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా మండలంలోని పలు రహదారులపై అధికారులు వాహనాల తనిఖీని బుధవారం ముమ్మరంగా చేపట్టారు. మండలంలోని బొల్లక్‌పల్లివద్ద ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి బ్రహ్మం వాహనాలు తనిఖీ చేశారు. వాహనదారులు ఎన్నికల నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. ప్రతి ఒక్కరూ తనిఖీ బృందానికి సహకరించాలని సూచించారు. ఆయన వెంట బృందం సభ్యులు ఉన్నారు.

## ఎమ్మెల్యేకు శుభాకాంక్షల వెల్లువ

నిజాంసాగర్/పిట్లం, అక్టోబర్25 : దసరా సందర్భంగా జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే బిచ్కుంద మండల కేంద్రంలోని తన నివాసంలో బుధవారం నిర్వహించిన అలయ్ బలయ్ కార్యక్రమానికి జుక్కల్ నియోజకవర్గంలోని నిజాంసాగర్, పిట్లం, మహ్మద్‌నగర్, పెద్దకొడప్‌గల్, బిచ్కుంద, జుక్కల్, మద్నూర్, డొంగ్లి మండలాల నుంచి బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులతో పాటు అభిమానులు తరలివచ్చారు. ఎమ్మెల్యే షిండేను కలిసి బంగారాన్ని అందిస్తూ దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఉదయం ప్రారంభమైన కార్యక్రమం రాత్రి వరకు కొనసాగింది. అలయ్ బలయ్ కార్యక్రమంలో బి చ్కుంద మండల కేంద్రంలో సందడిగా మారింది. ఎమ్మెల్యేను కలిసిన వారిలో బీఆర్‌ఎస్ పిట్లం నాయకులు జొన్న శ్రీనివాస్‌రెడ్డి, నర్సాగౌడ్, రవిచంద్ర, సాయిరెడ్డి, పండరి, గాండ్ల సత్యం, అంబదాస్, బాబాగౌడ్, ఆదిల్, పాండుపాటిల్ ఉన్నారు.



ఎమ్మెల్యే షిండేకు శుభాకాంక్షలు తెలుపుతున్న జుక్కల్ నాయకులు



ఎమ్మెల్యే షిండేతో పిట్లం మండల బీఆర్‌ఎస్ నాయకులు

## గాయత్రీ షుగర్స్‌లో పూజలు

నిజాంసాగర్, అక్టోబర్ 25: మండలంలోని మాగి గాయత్రీ చక్కర కర్మాగారంలో ఫ్యాక్టరీ మేనేజింగ్ డైరెక్టర్(ఎండీ) సరితారెడ్డి బుధవారం బాయిలర్‌కు పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2023-24 సంవత్సరానికి గాను నాలుగు లక్షల మెట్రిక్ టన్నుల చెరుకు క్రషింగ్ చేసేందుకు ఏర్పాట్లు పూర్తిచేశామని చెప్పారు. నవంబర్ 14వ తేదీ నుంచి క్రషింగ్ ప్రారంభిస్తామని అన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పర్మిట్లు, క్రషింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఆమె వెంట అధ్యక్షుడు శంకర్‌రావు, వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్‌రావు, ఎగ్జిక్యూటివ్ మురళి, కేన్ జనరల్ మేనేజర్ వెంగల్‌రెడ్డి, ఇంజినీరింగ్ జనరల్ మేనేజర్ రాజాబాబు, జనరల్ మేనేజర్ సుబ్బారెడ్డి, పీవో గోవింద్, కిరణ్‌కుమార్‌రెడ్డి, భక్తవత్సలరెడ్డి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



పూజ చేస్తున్న ఫ్యాక్టరీ ఎండీ సరితారెడ్డి

## హనుమాన్ ఆలయ శిఖర ప్రతిష్ఠాపన



శిఖరాన్ని ఊరేగిస్తున్న తుప్దాల్ గ్రామస్తులు

పెద్ద కొడప్‌గల్, అక్టోబర్ 25: మండలంలోని తుప్దాల్ గ్రామ హనుమాన్ ఆలయంపై బుధవారం శిఖర స్థాపన నిర్వహించారు. ఖత్‌గావ్ మహరాజ్ మల్లికార్జునప్ప ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. హనుమాన్ ఆలయంపై ఉన్న శిఖరాన్ని కోతులు ధ్వంసం చేశాయి. దీంతో మల్లికార్జునప్ప స్వామి సూచనల మేరకు హనుమాన్ ఆలయ శిఖరాన్ని పునః ప్రతిష్ఠించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## విద్యార్థినికి ఆర్థిక సహాయం అందజేత


ఎల్లారెడ్డి రూరల్, అక్టోబర్ 25: చదువుకు ఆర్థిక సమస్యలు అడ్డంకిగా మారొద్దని, బాగా చదివే పేద విద్యార్థులకు తాము అండగా ఉంటామని హెల్పింగ్ బ్రిడ్జ్ ఫర్ ఎడ్యుకేషన్ సంస్థ బాధ్యులు అన్నారు. లింగంపేట మండలం కోమటిపల్లి గ్రామానికి చెందిన వేల్పుల విజయ అనే విద్యార్థినికి ఇంజినీరింగ్ ట్యూషన్ ఫీజు రూ.28వేలను చెల్లించి, అందుకు సంబంధించిన రసీదును బుధవారం అందజేశారు. ప్రతిభ ఉన్న పేద విద్యార్థులు బాగా చదివి ఉన్నతస్థాయికి ఎదగాలని, దానికి తమ వంతు సహాయం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ బాధ్యులు శ్రీకాంత్, రమేశ్‌రెడ్డి, శ్రీశైలం, కిశోర్, నవీన్, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.



ట్యూషన్ ఫీజు చెల్లించిన రసీదు అందజేస్తున్న హెల్పింగ్ బ్రిడ్జ్ ఫర్ ఎడ్యుకేషన్ సంస్థ బాధ్యులు

# ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలి

ఎల్లారెడ్డి, అక్టోబర్ 25: రానున్న శీతాకాల సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు. ఎల్లారెడ్డికి నవంబర్ ఒకటో తేదీన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ వస్తున్న నేపథ్యంలో అందుకు సంబంధించిన కర పత్రాలను బుధవారం ఎల్లారెడ్డిలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి పద్మారావు మాట్లాడుతూ.. ఎల్లారెడ్డిలో నిర్వహించే మంద కృష్ణ మాదిగ సభకు అన్ని గ్రామాల నుంచి మాదిగలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు